ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి
5
గురువారం 21 మార్చి 2024

రంజాన్ వేళలు | ఇఫ్తార్: 6.33 | సహర్: 4.57 (శుక్రవారం)

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.126	183	208
సూర్యాపేట	రూ.120	180	210
నల్లగొండ	రూ.126	184	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0 । కనిష్ఠం 23.4

స్తంభోద్భవుడి సన్నిధిలో..



యాదగిరిగుట్ట కొండపైన విష్ణుపుష్కరిణిలో చక్రతీర్థ స్నానం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు, వేదపండితులు

వైభవంగా చక్రతీర్థ స్నానం

- యాగశాలలో శాస్త్రోక్తంగా మహాపూర్ణాహుతి
- కొండపైన విష్ణుపుష్కరిణిలో భక్తుల పుణ్యతీర్థ స్నానాలు
- స్వామివారిని దర్శించుకున్న గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

స్తంభోద్భవుడు.. ఏకశిఖరవాసుడు.. స్వయంభు పాంచనారసింహుడు వెలిసిన.. మహిమాన్విత యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో బుధవారం శ్రీచక్రత్ ఆళ్వార్ల అవబృత స్నానం, యాగశాలలో మహాపూర్ణాహుతి పర్వాలు శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో కొనసాగాయి. దీంతోపాటు దేవతోద్వాసన, శ్రీపుష్పయాగం, దోపు ఉత్సవాన్ని ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలలో అత్యంత ప్రాధాన్యమున్న ఘట్టం చక్రతీర్థ స్నానం. ఉత్సవమూర్తులను, చక్రత్ ఆళ్వార్లను మంగళవాయిద్యాలు, వేదపారాయణలు, భక్తుల జయజయ ధ్వానాలు, కోలాట ప్రదర్శనల నడుమ కొండపైన విష్ణుపుష్కరిణి వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చి చక్రతీర్థస్నానం నిర్వహించారు. అంతకుముందు వసంతోత్సవం వైభవంగా సాగింది.

● యాదగిరిగుట్ట

•7లో..



గవర్నర్‌కు స్వామివారి ప్రసాదాన్ని అందజేస్తున్న సీఎస్ శాంతికుమారి

గుండెల నిండా ఆనందం

గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

యాదగిరీశుడి దర్శనంతో గుండెల నిండా ఆనందం కలిగిందని గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ అన్నారు. బుధవారం ఆయన యాదగిరిక్షేత్రాన్ని సందర్శించి వార్షిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవ కైంకర్యాల్లో పాల్గొన్నారు. ఆయన హైదరాబాద్ రాజ్‌భవన్ నుంచి కాన్వాయ్‌లో రోడ్డుమార్గంలో సాయంత్రం 7.10గంటలకు యాదగిరిక్షేత్రానికి విచ్చేశారు. కొండపైన ప్రధానాలయంలోని స్వయంభువులను దర్శించుకుని, స్వామివారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని సాయంత్రం సుమారు 8.45గంటలకు తిరిగి హైదరాబాద్‌కు తరలివెళ్లారు. యాదగిరిక్షేత్రంలో గవర్నర్ పర్యటన సుమారు గంట 35 నిమిషాలపాటు సాగింది. క్షేత్ర సందర్శనకు విచ్చేసిన ఆయనకు సీఎస్ శాంతికుమారి, ఆలయ అర్చకబృందం, దేవస్థాన, జిల్లా యంత్రాంగం ఘనంగా స్వాగతం పలికింది. కొండపైన పడమటి దిశలోని అతిథి గృహం వద్దకు చేరుకోగా జిల్లా పోలీసు అధికారులు ఆయనకు గౌరవ వందనం అందజేశారు.

అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎక్కడ చూసినా రాతి శిలల నిర్మాణాలే కనిపిస్తున్నాయని, ఇంతటి మహిమాన్విత ఆలయంలోనికి అడుగు పెట్టగానే ఏదో తెలియని ఆధ్యాత్మికానుభూతి కలిగిందన్నారు. అనంతరం ఆయన అక్కడ నుంచి ఉత్తర దిశలోని లిఫ్ట గుండా పడమటి దిశలోని అతిథి గృహానికి చేరుకుని కాన్వాయ్‌లో తిరిగి హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్లారు. ఆయన వెంట దేవస్థాన, జిల్లా అధికారులు తదితరులున్నారు.

వ్యవసాయరంగానికి

పునరుజ్జీవం కోసం

- నేటి నుంచి రెండు రోజుల పాటు సదస్సు
- దక్షిణ తెలంగాణ ప్రాంతీయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో నిర్వహణ
- ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా నాణ్యతలేని విత్తనాలు, మార్కెటింగ్ కొరత



వ్యవసాయరంగం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుండగా, దీన్ని నివారించేందుకు ప్రభుత్వం, శాస్త్రవేత్తలు, అధికారులు చర్యలు తీసుకోవాలనే అభిప్రాయాలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా వరి, పండ్లతోటలు ఎక్కువగా సాగుచేస్తారు. ఈ పంటల సాగుతో పాటు, పంట ఉత్పత్తుల మార్కెటింగ్‌లో ఎదురవుతున్న ఇబ్బందులకు పరిష్కారాలు లభిస్తే తప్ప సాగు లాభదాయకం కాదని రైతులు అంటున్నారు. ఈ నేపథ్యంలో పంటలసాగు, వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఎదురవుతున్న సమస్యలకు పరిష్కార మార్గాలు సూచించేందుకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పూనుకుంది. అందులో భాగంగా నల్లగొండలో దక్షిణ తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ అధికారుల సలహా సంఘ సమావేశాన్ని నిర్వహించేందుకు నిర్ణయించింది. ఈ నెల 21, 22న రెండు రోజులపాటు ఈ సమావేశాలు నిర్వహించనుంది.

● ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ

ఉమ్మడి జిల్లాలో 9.37లక్షల ఎకరాల్లో సాగయ్యే వరిలో అత్యధిక భాగం నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలోనే ఉంది. వరిలో ప్రధానంగా ఉల్లికోడు, మొవ్వతెగులు వంటి చీడపీడలు, సుడిదోమ తాకిడితో దిగుబడులపై ప్రభావం చూపి రైతులు నష్టపోతున్నారు. ప్రైవేట్ విత్తనాలపైనే రైతులు ఎక్కువగా ఆధారపడడంతో, నాణ్యతలేని విత్తనాలతో దిగుబడులు తగ్గి అప్పులపాలవుతున్నారు. కూలీల కొరత నేపథ్యంలో యాంత్రీక వ్యవసాయానికి వరి సాగే అనుకూలమవడంతో రైతులు ఎక్కువగా వరి సాగు వైపే మొగ్గు చూపుతున్నారు. దీంతో వరి సాగు రైతులకు లాభసాటిగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది. ప్రధానంగా ధాన్యం మార్కెటింగ్‌కు రైతులు అవస్థలు పడుతున్నారు. పంట పండిన తర్వాత రైతులు విక్రయించుకునేందుకు నానా ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. విత్తనాలు, ఎరువులు, ఇతర ఖర్చులు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో పెట్టుబడికి సమాంతరంగా ధర వచ్చే అవకాశాలు లేకపోవడంతో రైతులు అప్పులపాలవుతున్నారు. వరి తరువాత అత్యధికం ఎకరాల్లో సాగయ్యే పత్తిలోనూ రైతులు ప్రతికూలతలను ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా నాసిరకం విత్తనాలు, బెట్ట, అధిక వర్షపాతాన్ని తట్టుకునే వంగడాలు లేకపోవడం, జిల్లాలోని మెట్టభూములకు అనుకూలమైన విత్తనాలు లేకపోవడం వంటి ప్రతికూలతలతో పత్తి రైతులు నష్టపోతున్నారు. వీటితో పాటు పత్తికి మద్దతు ధర కోసం సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నా, రైతులకు మాత్రం ఆశించిన ధర లభించక దళారీలను ఆశ్రయిస్తున్నారు. వేరుశనగ, కంది పంటల సాగుకు జిల్లా నేలలు అనుకూలమైనా, పందులు, కోతుల బెడదతో ఈ పంటల సాగుకు రైతులు ముందుకురావడం లేదు. అరకొరగా రైతులు ఈ పంటలు సాగుచేసినా, పంట చేతికొచ్చేంతవరకు నమ్మకం లేదు. వీటితోపాటు ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా సుమారు 7లక్షల ఎకరాల్లో బత్తాయి తోటలు, మరో 1.50లక్షల ఎకరాల్లో నిమ్మతోటలు సాగవుతున్నాయి. ఈ పండ్ల తోటల సాగుకు రైతులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భూగర్భజలాలు తగ్గిన ప్రస్తుత పరిస్థితుల్లో పంటల దిగుబడిపై ఆ ప్రభవం కనిపిస్తోంది. నీటి వసతి లేకపోవడంతో పాటు మార్కెటింగ్ సదుపాయం కూడా రైతులకు జిల్లాలో అందుబాటులో లేకపోవడంతో వారు అనివార్యంగా దిగుబడులను దళారులకు విక్రయిస్తున్నారు. మార్కెటింగ్ సదుపాయంతో పాటు, నీటి వసతి కోసం డ్రిప్ ఇరిగేషన్, యంత్రాలను సబ్సిడీపై ప్రభుత్వం అందించి పంటల సాగుకు సహకరించాలని రైతులు కోరుతున్నారు. జిల్లాలో రైతులు మార్కెటింగ్ సమస్యను ప్రధానంగా ఎదుర్కొంటున్నారని, దీన్ని అధిగమించేందుకు ఫుడ్‌పార్క్ ఏర్పాటు చేస్తామని గత ప్రభుత్వం ప్రకటించినా, అది నెరవేరలేదు. జిల్లాలో వరి, బత్తాయి వంటి ప్రధానమైన పంటలకు సంబంధించి మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

ఇదిలా ఉండగా, రైతులు పంటలసాగులో, వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటికి పరిష్కారం సూచించే ఉద్దేశంతో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నల్లగొండలో ఈ నెల 21, 22న రెండు రోజులపాటు సలహా మండలి సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ సమావేశాల్లో ఉమ్మడి జిల్లా రైతులు వరి సాగు, ఇతర ఆరుతడి, ఉద్యాన పంటల సాగులో ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, రైతులకు ఎలాంటి మద్దతు ఇవ్వాలనే అంశంపై ఈ సదస్సు సూచించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు, రేపు సమావేశాలు

నల్లగొండ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 21, 22న జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో దక్షిణ తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ అధికారుల సలహా సంఘ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు కంపసాగర్ శాస్త్రవేత్త జి.శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత వ్యవసాయరంగంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని వాటిని తీర్చే దిశగా పరిశోధనలు చేపట్టడం, సమస్యలకు సరైన పరిష్కారం అందించడంపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. గత ఏడాది రైతులు లేవనెత్తిన అంశాలకు సాంకేతిక పరమైన పరిష్కారాలు తెలియజేయడంతో పాటు గత ఏడాది వ్యవసాయ విశ్వవిద్యాలయం సాధించిన ప్రగతిని వివరిస్తామన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, దక్షిణ తెలంగాణ మండల వ్యవసాయ అధికారులు, అనుబంధశాఖల అధికారులు, 11 జిల్లాల రైతులు పాల్గొంటారని తెలిపారు. రైతులు ఈ సదస్సులో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సీపీఎం ఒంటరి పోరు

● భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా ఎండీ జహంగీర్



ఎండీ జహంగీర్

యాదాద్రి, మార్చి20 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు సీపీఎం ఒంటరి పోరుకు సిద్ధమైంది. సీపీఎం భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్‌ను రాష్ట్ర కమిటీ బుధవారం ప్రకటించింది. రాష్ట్రంలో మొత్తం 17 లోక్‌సభ స్థానాల నుంచి పోటీలో ఉండటనున్నట్లు ప్రకటించిన రాష్ట్ర కమిటీ, రాష్ట్రంలోనే సీపీఎం నుంచి మొదటి అభ్యర్థిగా జహంగీర్‌ను ప్రకటించింది. ఈస్థానం నుంచి పోటీలో ఉంటున్నట్లు ఇటీవల ఆపార్టీ నేతలు కూడా వ్యాఖ్యానించారు. ఈమేరకు పార్టీ ఒంటరిగా పోటీ చేసేందుకు సిద్ధమైంది. జహంగీర్ స్వగ్రామం రామన్నపేట మండలం మునిపంపుల. విద్యార్థి దశలోనే ఎస్ఎఫ్ఐలో చేరి, ప్రజా సంఘాల్లో పనిచేస్తూ పూర్తికాలం కార్యకర్తగా పనిచేస్తున్నారు. వామపక్ష భావజాలంతో ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నారు. గత ఎన్నికల్లోనూ ఈ నియోజకవర్గం నుంచి సీపీఎం, సీపీఐలు పోటీచేశాయి. 2009లో సీపీఎంనుంచి మాజీ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య, 2014 ఎన్నికల్లో సీపీఎం జాతీయ కార్యవర్గసభ్యుడు చెరుపల్లి సీతారాములు పోటీ చేశారు. 2019 ఎన్నికల్లో ఈస్థానం నుంచి సీపీఐ అభ్యర్థి గోదా శ్రీరాములు పోటీ చేశారు. భువనగిరి నియోజకవర్గం ఏర్పడకముందు పూర్వపు నల్లగొండ నియోజకవర్గంగా ఉండేది. ఆ సమయంలో ఈ నియోజకవర్గం నుంచి టీడీపీ-వామపక్ష మిత్ర పక్షాల అభ్యర్థులుగా సీపీఐ నుంచి బొమ్మగాని ధర్మభిక్షం, సురవరం సుధాకర్‌రెడ్డిలు ఎంపీగా పోటీచేసి గెలుపొందారు. సీపీఐ నుంచి పోటీ చేసేందుకు రాష్ట్రంలో ఏదైనా ఒక నియోజకవర్గాన్ని కేటాయించాలని పార్టీ అధిష్ఠానం కాంగ్రెస్ పార్టీకి విజ్ఞప్తిచేసింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ ఉమ్మడిగా కలిసి పోటీ చేశాయి. ఈ నేపథ్యంలో తమకు ఒక సీటు కేటాయించాలని కోరాయి. అయితే కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి ఇప్పటివరకు సీపీఐకి టికెట్ కేటాయింపుపై ఎలాంటి నిర్ణయం వెలువడలేదు. ఈ నేపథ్యంలో సీపీఐ భువనగిరి స్థానం నుంచి ఎన్నికల బరిలో ఉంటుందా? లేదా అన్నది వేచి చూడాల్సిందే.

బీసీలకు సగం సీట్లు ఇవ్వాల్సిందే

● లేదంటే రాజకీయ పార్టీల భరతం పడతాం ● జాజుల శ్రీనివాస్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

సంస్థాన్‌నారాయణపురం మార్చి 20: ప్రస్తుతం జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు బీసీలకు సగం లోక్‌సభ స్థానాలను కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్‌చేశారు. సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం, రాజకీయ సమానత్వం పాటిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో బీసీలకు సగం పార్లమెంటు స్థానాలు కేటాయించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. బీఆర్ఎస్ సామాజిక న్యాయాన్ని తుంగలోకి తొక్కినందుకే బీసీలు బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పి కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు. కాంగ్రెస్ కూడా బీఆర్ఎస్ పార్టీలాగే సామాజిక న్యాయం పాటించకపోతే బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు. వారసత్వ, కుటుంబ, అగ్రకుల రాజకీయాలు మానుకోవాలని, జెండా మోసి జిందాబాద్ కొట్టిన నిజమైన కార్యకర్తలకు బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఏరు దాటక ముందు ఓడ మల్లయ్య, ఏరు దాటిన తర్వాత బోడ మల్లయ్య అన్న చందంగా కాంగ్రెస్ బీసీలపట్ల వ్యవహరిస్తే రాజకీయంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో 60శాతం పైగా ఉన్న బీసీలకు కాంగ్రెస్ అవకాశం కల్పించాలని డిమాండ్‌చేశారు. రాష్ట్రంలో 17 పార్లమెంట్ స్థానాల్లో బీసీలకు ఎనిమిది పార్లమెంటు స్థానాలు కేటాయించాలని, అలాగే బీసీల జనాభా అధికంగా ఉన్న నియోజకవర్గాల్లో సీట్లు కేటాయించాలన్నారు. బీసీలను రాజకీయంగా అణచివేయాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. సమావేశంలో సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్, బీసీ యువజన సంఘం మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు వీరమల్ల కార్తీక్, రాష్ట్ర కార్యదర్శి గణం నరసింహ, నాయకులు వరికుప్పల మధు, లక్ష్మణ్ గౌడ్, శ్రీరాముల నరసింహ, కొల్లూరు నవీన్, చరక సత్తమ్మ పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి గ్రామీణ వృత్తులే ఆధారం

● నేషనల్ డిఫెన్స్ కాలేజీ అధికారుల బృందం
● భూదాన్‌పోచంపల్లి చేనేత వస్త్ర తయారీ పరిశీలన



చేనేత చీరలను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

భూదాన్‌పోచంపల్లి, మార్చి 20: దేశాభివృద్ధికి గ్రామీణ చేతి వృత్తులే ఆధారమని, చేనేత టైఅండ్‌డై ఇక్కత్ పరిశ్రమ దేశానికే మకుటంలేని మహారాజు అని న్యూఢిల్లీలోని నేషనల్ డిఫెన్స్ కాలేజీకి చెందిన అధికారుల బృందం కితాబిచ్చింది. నేషనల్ డిఫెన్స్ కాలేజీకి చెందిన 16 మంది అధికారుల బృందం బుధవారం భూదాన్‌పోచంపల్లిని సందర్శించింది. ఈ సందర్భంగా పట్టణంలోని చేనేత సహకార సంఘం, చేనేత కార్మికుల గృహాలను, కళా పునర్వి హ్యాండ్లూమ్ యూనిట్‌ను సందర్శించి చేనేత వస్త్ర తయారీ ప్రక్రియలను పరిశీలించి మార్కెట్ విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఈ బృందంలో మన దేశానికి చెందిన అధికారులతోపాటు టాంజానియా, నేపాల్, మయన్మార్, బ్రెజిల్, యూకే దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేనేత కార్మికుల గృహాలకు వెళ్లి చేనేత వస్త్ర తయారీ ప్రక్రియలను పరిశీలించారు. చేనేత మగ్గాలను సందర్శించి చేనేత వస్త్ర తయారీని పరిశీలించారు. పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ వస్త్రాల డిజైన్లను రూపొందించన కళాకారుల అద్భుతమైన కళాత్మక ప్రతిభను వారు ప్రశంసించారు. ప్రపంచవ్యాప్తంగా పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలకు మంచి పేరు ఉందన్నారు. నేటి మార్కెట్‌కు అనుగుణంగా వస్త్రాలు, నూతన డిజైన్లను రూపొందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా చేనేత జౌళీశాఖ ఏడీ విద్యాసాగర్, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పోచంపల్లి చేనేత సహకార సంఘం పీఐ ప్రసాద్, మేనేజర్ రుద్ర అంజనేయులు, తహసీల్దారు శ్రీకాంత్‌రెడ్డి, ఎంఆర్ఐ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

త్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి

● పలువురు ప్రజాప్రతినిధులను కలిసిన నిర్వాసితులు

భువనగిరి రూరల్, మార్చి 20: రీజనల్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్‌ను మార్చే విధంగా చర్యలు తీసుకోవాలని నిర్వాసితులు బుధవారం పలువురు ప్రజాప్రతినిధులను కలిశారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కోదండరాం, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, సీఎం వ్యక్తిగత కార్యదర్శులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ కోసమే అప్పటి ఎమ్మెల్యే, మంత్రుల అవసరాలకు తగ్గట్టుగా రీజనల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పించారని ఆరోపించారు. అలైన్‌మెంట్ మార్పుకోసం గత రెండేళ్ల నుంచి తాము ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నో పోరాటాలు చేసినప్పటికీ తమ ఉద్యమాలను భగ్నం చేసేందుకు బాధిత భూములు కోల్పోతున్న రైతులకు సంకెళ్లు వేసి జైలుకు కూడా పంపారని, భూమిని కోల్పోతున్న దాదాపు ఆరుగురు రైతులు గుండెపోటుకు గురై మృత్యువాతపడ్డారని వివరించారు. ఇప్పటికే తాము బునాదిగాని, రిలయన్స్ గ్యాస్ పైప్‌లైన్, యాదాద్రి రహదారి విస్తరణ, కాళేశ్వరం ప్రాజెక్టు ఫీడర్ ఛానల్ నిర్మాణాలకు భూములు కోల్పోయామని, రీజనల్ రింగ్ రోడ్ ఏర్పాటుతో ఉన్న భూములు కోల్పోతే రోడ్డున పడే పరిస్థితి నెలకొంటుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. అలైన్‌మెంట్ మార్చి త్రిపుల్ ఆర్ నిర్మాణం చేపట్టే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బాధితులు అవిశెట్టి పాండుయాదవ్, పలెర్ల యాదగిరి, కోటాల అనిల్, బొజ్జ రమేష్, అవిశెట్టి రమేష్, యాదిరెడ్డి, రాజశేఖర్, బాలకృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.



పొన్నం ప్రభాకర్‌ను కలిసిన త్రిపుల్ ఆర్ నిర్వాసితులు

ప్రతి కూలీకి ఉపాధి పని కల్పించాలి



తుక్కాపురంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్‌రావు

భువనగిరి రూరల్, మార్చి 20: జాబ్‌కార్డు కలిగి ఉన్న ప్రతి కూలీకి ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించాలని ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని తుక్కాపూర్‌లో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. పని ప్రదేశంలో మౌలిక వసతుల కల్పన, ప్రతీరోజు ఎంతమంది కూలీలు పనులకు హాజరువుతున్నారనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. కాగా పల్లె ప్రకృతి వనం, నర్సరీల నిర్వహణ తీరును క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఆయనవెంట పంచాయతీ కార్యదర్శి ఆరే రాజు, టెక్నికల్ ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలో రూ.9.09లక్షలు స్వాధీనం


రామాపురం చెక్‌పోస్టు వద్ద నగదు స్వాధీన పత్రాన్ని అప్పగిస్తున్న పోలీసులు

నార్కట్‌పల్లి, కోదాడ రూరల్, పెన్‌పహాడ్, మార్చి 20: ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అనుమతికి మించి తరలిస్తున్న రూ.9.09లక్షల నగదును పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో పలువురి నుంచి రూ.5.12లక్షల నగదు, బెల్టు షాపుల నుంచి రూ.2,925 విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు. నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చేపట్టిన వాహన తనిఖీల్లో ఈ నగదు, మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని నల్లబండగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని ఆంధ్రా సరిహద్దు రామాపురం క్రాస్‌రోడ్డు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద నాలుగు వాహనాల నుంచి రూ. 3.03 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలోని దూపహాడ్‌లో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి నుంచి రూ.94 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రవీందర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



నర్సింహ(ఫైల్)

గుర్రంపోడు, మార్చి 20: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని ఆములూరు గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వంగూరి నర్సింహ(52) తన ఇంటికి నిర్మించిన ప్రహరీకి ఫ్లోరింగ్ చేస్తుండగా మోటారుకు అమర్చిన విద్యుత్తు వైర్ తేలడంతో దానికి తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. నర్సింహకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హిజ్రాల బైండోవర్



హిజ్రాలను బైండోవర్ చేస్తున్న పోలీసులు

తుంగతుర్తి, మార్చి 20: సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలకేంద్రంలో సోమవారం వీరంగం సృష్టించిన హిజ్రాలను పోలీసులు బుధవారం బైండోవర్ చేశారు. హిజ్రాల గుంపులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ఘటనపై పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసి 18 మంది హిజ్రాలను బుధవారం స్థానిక తహసీల్దార్ రమణారెడ్డి ఎదుట బైండోవర్ చేశారు. మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, శ్రీను, ఎస్ఐ ఏడుకొండలు పాల్గొన్నారు.

మర్రిపడగలో చోరీ

గుండాల, మార్చి 20: యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలంలోని మర్రిపడగ గ్రామంలోని ఓ ఇంట్లో మంగళవారం చోరీ జరిగింది. గ్రామానికి చెందిన ఆటిపాముల రాములు తాళం వేసి జనగామకు వెళ్లాడు. మంగళవారం రాత్రి ఇంట్లోకి జొరబడిన దొంగలు ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న బీరువాలో ఉన్న రూ.లక్షా 20వేల నగదు ఎత్తుకెళ్లారు. అదే విధంగా కొండబోయిన సత్తయ్య ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.10వేల నగదు అపహరించారు. బాధితులు పనులు ముగించుకొని తిరిగి ఇళ్లకు వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యాకన్న తెలిపారు.

వైభవంగా చక్రతీర్థ స్నానం


● గుట్టలో శాస్త్రోక్తంగా మహాపూర్ణాహుతి ● కొండపైన విష్ణుపుష్కరిణిలో భక్తుల పుణ్యతీర్థ స్నానాలు



విష్ణుపుష్కరిణి చెంతకు ఊరేగింపుగా వెళుతున్న భక్తులు



దేవతోద్వాసన, భేరీ పూజా వైదిక పర్వాలు నిర్వహిస్తున్న అర్చకులు



విష్ణుపుష్కరిణిలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

యాదగిరిగుట్ట, మార్చి20: స్తంభోద్భవుడు.. ఏకశిఖరవాసుడు.. స్వయంభూ పాంచనారసింహుడు వెలిసిన.. మహిమాన్విత యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో బుధవారం శ్రీచక్రత్ ఆళ్వార్ల అవభృత స్నానం, యాగశాలలో మహాపూర్ణాహుతి పర్వాలు శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో వైభవంగా జరిగాయి. అత్యంత ప్రాధాన్యత గల ఘట్టం చక్రతీర్థ స్నాన వేడుక. లక్ష్మీనృసింహుల ఉత్సవమూర్తులను, చక్రత్ ఆళ్వార్లను ప్రత్యేక సేవలో తీర్చిదిద్దిన ఆచార్యులు మంగళవా యిద్యాలు, వేదపారాయణాలు, భక్తుల జయజయ ధ్వానాలు, కోలాట ప్రదర్శనల నడుమ కొండపైన విష్ణుపుష్కరిణి వద్దకు ఊరేగింపుగా తరలి వచ్చారు. వసంతోత్సవం శోభాయమానంగా సాగింది. ప్రభాతవేళ శ్రీవైష్ణవ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రభాతభేరి కార్యక్రమం కొనసాగింది. ఆధ్యాత్మిక ఘట్టాలను దేవస్థాన ప్రధానార్చకులు నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, అర్చకబృందం, రుత్వికులు ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈవో భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహాపూర్ణాహుతి

స్వామివారి బ్రహ్మోత్సవాల్లో స్వస్తి పుణ్యాహవాచనంతో ఆరంభించి మహాపూర్ణాహుతి వరకు నిర్వహించే ప్రతీ వేడుక మంగళ ప్రదములే.. విశ్వశాంతి.. లోకకల్యాణంలో కోసం నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాలు ఏకకుండాత్మకంగా నవాహ్నికంగా నిర్వహించడం ఆలయ సంప్రదాయం. మహోత్సవాలకు విచ్చేసే అశేష భక్తకోటిని అనుగ్రహింపజేయని కోరుతూ ముప్పై మూడు కోట్ల దేవతలను యాగశాలలో నిత్య హవన పూజలలో ఆయా దేవతలను వారివారి మూల మంత్రాలతో హవిస్సులను అందజేస్తారు. సువృష్టితో లోకాలను క్షేమం కలిగించాలని వేడుకొంటూ మహోత్సవాల పరసమాప్తిగా మహాపూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తారు.

దోపోత్సవం

పరమ భక్తాగ్రేసరుడు, ఆళ్వారాచార్యుడు తిరుమంగైయాళ్వార్ జీవిత చరిత్రను శ్రీవైష్ణవ దేవాలయాల్లో బ్రహ్మోత్సవాల్లో ఉత్సవాంతంగా హరికథా కాలక్షపంలో తెలిపే వేడుకే దోపోత్సవం. భక్తరక్షణా తత్పరుడు శ్రీమన్నారాయణుడుని త్రికరణ శుద్ధిగా కొలిస్తే ముక్తిని ప్రసాదిస్తాడని తిరుమంగైయాళ్వార్ చరిత్ర తెలుపుతోంది. తన ప్రేయసి కుముదవల్లి కోరిక మేరకు ప్రతి నిత్యం 1116 మంది బ్రాహ్మణోత్తములకు అన్న సంతర్పణ చేసేందుకు దారి దోపిడీ దొంగగా మారాడు. అయినా భగవానుడిపై ఆయనకు ఉన్న అచంచలమైన భక్తి విశ్వాసాలతో నిస్వార్థ పూరితంగా జరిపిన అన్న సంతర్పణకు శ్రీమన్నారాయణుడు కరుణించి మొక్షాన్ని ప్రసాదిస్తాడు. నిస్వార్థ భక్తితో స్వామిని సేవిస్తే ఆయన కరుణించి ముక్తిని ప్రసాదిస్తాడని, యావత్ భక్త జనకోటి యజ్ఞయాగాది క్రతువులు ఆచరిస్తూ.. అశేషంగా అన్న సంతర్పణ జరపి భగవానుడి కృపా కటాక్షాలు పొందాలని దోపోత్సవం నిర్వహించడం ఆనవాయితీ.

ముగిసిన సంస్కృతిక కార్యక్రమాలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కొండపైన ఈ నెల 15న ఆరంభమైన ధార్మిక, సాహిత్య, సంగీత మహాసభలు బుధవారం ముగిసాయి. ఉదయం వీరప్రతాప భజన మండలి, పాండురంగ భజన మండలి, గాయిత్రి భజన మండలిలచే భక్తి భజనలు, బ్రహ్మశ్రీ భాస్కరభట్ల ఆంజనేయశర్మచే ఆధ్యాత్మిక ప్రవచనం, లక్ష్మీనారాయణ భాగవతార్‌చే హరికథా కాలక్షేపం, సాయంత్రం ఎస్ నాగజ్యోతి, శ్రీమతి కౌటూరి గాయిత్రిలచే భక్తి సంగీతం, శ్రీమతి తోరణాల పద్మచే కర్ణాటక సంగీతం, కుమారి మాహ్నిత కూచిపూడి నృత్యం, శ్రీమతి శోభరాజుచే సంగీత కచేరి, శ్రీమతి జ్వాలాముఖి కూచిపూడి నృత్యం, రిషి డాన్స్ అకాడమిచే పేరిణి నృత్యం, అనంతరం ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్య కచేరి సంగీత మహా సభల పరిసమాప్తి. యాదగిరీశుడి సన్నిధిలో బుధవారం నిత్యవిధి కైంకర్యాలు ఆగమ శాస్త్రరీతిలో వైభవంగా జరిగాయి. నిర్వహించారు. కొండపైన అనుబంధ శివాలయంలో రామలింగేశ్వరసామికి నిత్యవిధి కైంకర్యాలు, నిత్య రుద్రహవన పూజలు స్మార్త సంప్రదాయరీతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.22,98,275 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు.

విష్ణుపుష్కరిణిలో పుణ్యస్నానాలకు అనుమతి

విష్ణుపుష్కరిణిలో చక్రతీర్థ పుణ్యస్నానాలకు భక్తులకు దేవస్థాన అధికారులు బుధవారం అనుమతి ఇచ్చారు. బ్రహ్మోత్సవాల్లో విశేష ఘట్టమైన చక్రతీర్థ స్నానం సంప్రదాయరీతిలో కొండపైన సహజ సిద్ధ విష్ణుపుష్కరిణిలో నిర్వహించడం ఆనవాయితీ. అయితే ఆలయ ఉద్ఘాటన జరిగిన అనంతరం తొలిసారి బ్రహ్మోత్సవాల్లో మాత్రం దేవస్థాన అధికారులు కొండపైన విష్ణుపుష్కరిణిలో సామాన్య భక్తులను అనుమతించలేదు. ఆలయ పునర్నిర్మాణానికి ముందు, పునర్నిర్మాణ సమయంలోనూ బ్రహ్మోత్సవాల్లో విష్ణుపుష్కరిణిలో సామాన్య భక్తులను చక్రతీర్థ పుణ్యస్నానాలకు అనుమతించారు. ఆలయ జీర్ణోద్ధరణ సమయంలో తాత్కాలిక బాలాలయంలో వేడుకలు నిర్వహించారు. 2022లో నిర్వహించిన వార్షిక బ్రహ్మోత్సవాల్లో భక్తులను పుష్కరిణిలోనికి అనుమతించలేదు. బాలాలయంలోని గంగాళంలోని పవిత్ర జలాలతో అర్చకబృందం సంప్రోక్షణ జరిపారు.

గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ పర్యటన సాగిందిలా..

రాష్ట్ర నూతన గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ యాదగిరిక్షేత్రాన్ని సందర్శించి వార్షిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవ కైంకర్యాల్లో పాల్గొన్నారు. ఆయన హైదరాబాద్ రాజ్‌భవన్ నుంచి కాన్వాయ్‌లో రోడ్డుమార్గంలో సాయంత్రం 7.10గంటలకు యాదగిరిక్షేత్రానికి విచ్చేశారు. కొండపైన ప్రధానాలయంలోని స్వయంభువులను దర్శించుకుని, స్వామివారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని సాయంత్రం సుమారు 8.45గంటలకు తిరిగి హైదరాబాద్‌కు తరలివెళ్లారు. అనంతరం ఆయన లిఫ్టు గుండా ఆలయ తిరువీధుల్లోకి చేరుకుని తూర్పు పంచతల రాజగోపురం నుంచి ప్రధానాలయంలోకి వచ్చారు. ప్రధానాలయ తూర్పు రాజగోపురం వద్ద దేవస్థాన అర్చకస్వాములు, వేద పండితులు ఆలయ సంప్రదాయం ప్రకారం పరివెట్టం కట్టి పూర్ణకుంభంతో వేదమంత్రాలు, మంగళవాయిద్యాలతో స్వాగతం తెలిపారు. ఆయన తూర్పు ఈశాన్య త్రితల రాజగోపురం నుంచి ప్రధానాలయంలోనికి ప్రవేశించి ఆంజనేయస్వామికి, గండభేరుండ లక్ష్మీనృసింహుడిని దర్శించుకున్నారు. ముఖమండపంలో స్వర్ణతాపడ ధ్వజస్తంభం, బలిపీఠంలకు మొక్కి గర్భాయంలోనికి వెళ్లారు. గర్భాలయంలో అర్చకస్వాములు గోత్రనామాలతో సువర్ణ పుష్పార్చన పూజలు జరిపి హారతి, శఠగోపం అందజేశారు. ముఖమండపంలో ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో అర్చకబృందం, వేదపండితులు చతుర్వేదాలతో ఆశీర్వచనం జరిపారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి ఆయనకు స్వామివారి శేషవస్త్రాలను, అభిషేకం లడ్డూ ప్రసాదాలను అందజేశారు. సీఎస్ శాంతి కుమారి ఆయనకు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

యాదగిరీశుడి సేవలో తెలంగాణ సీఎస్ శాంతికుమారి

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని బుధవారం సీఎస్ శాంతికుమారి దర్శించుకున్నారు. క్షేత్ర సందర్శనకు విచ్చేసిన ఆమెకు కొండపైన పడమటి దిశలోని లిఫ్టు వద్ద యాదాద్రి భువనగిరి కలెక్టర్ హనుమంతు కే.జెండగే, డీసీపీ రాజేశ్‌చంద్రలు మొక్కలను అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఆమె లిఫ్టు గుండా నేరుగా ఉత్తర తిరుమాడవీధి గుండా శివాలయంలోనికి వెళ్లారు. శివాలయంలో పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి వద్ద ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శివాలయ అర్చకులు పూజలనంతరం ఆమెను ఆశీర్వదించారు.

షేర్‌మార్కెట్‌లో నష్టపోయి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

మిర్యాలగూడ అర్బన్, మార్చి 20: షేర్ మార్కెట్‌లో నష్టపోయి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం రాత్రి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌లో ఈ సంఘటన జరిగింది. స్థానికులు, టూటౌన్ ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం... మిర్యాలగూడ పట్టణానికి చెందిన గోలి శ్రీనివాసరావు (43) ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా (వర్క్ ఫ్రమ్ హోం) పని చేస్తున్నాడు. ఇద్దరు పిల్లలు కలిగిన తర్వాత రెండేళ్ల క్రితం భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తగా ఆమె భర్తకు దూరంగా ఉంటోంది. భార్యాభర్తల మధ్య ఏర్పడిన గొడవలపై పోలీస్‌స్టేషన్‌లో కేసులు సైతం పెట్టుకొని కోర్టు విచారణ ఎదుర్కొంటున్నారు. శ్రీనివాసరావు షేర్ మార్కెట్ వ్యాపారంలో ఆర్థికంగా దెబ్బతిని అప్పుల ఊబిలో చిక్కుకున్నాడు. భార్య పిల్లలు దూరం కావడం, ఆర్థిక ఇబ్బందులు వెంటాడటంతో మానసికంగా కుంగిపోయిన శ్రీనివాసరావు తల్లిదండ్రులు ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని బలవన్మరణం చెందాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆత్మహత్యకు గల కారణాలు తెలుసుకున్నారు. శ్రీనివాసరావు గదిలో పోలీసులకు సూసైడ్ నోట్ లభ్యమైంది. షేర్ మార్కెట్ నష్టం, భార్యా పిల్లలు దూరమవడంతో మానసికంగా నలిగిపోతూ ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోట్‌లో రాసినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడు శ్రీనివాసరావు తండ్రి హన్మంతరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

ఎంఐఎం జిల్లా అధ్యక్షుడిపై కేసు నమోదు

నల్లగొండ టౌన్, మార్చి 20: రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కాన్వాయ్‌ను అడ్డుకోవడంతో పాటు బందోబస్తులో ఉన్న పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు రజీయుద్దీన్‌తో పాటు అతని అనుచరులపై స్థానిక వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 16వ తేదీన రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కలెక్టరేట్ జరిగిన సమావేశంలో పాల్గొని తిరిగి వెళ్తుండగా ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు రజీయుద్దీన్‌తో పాటు మరికొందరు సీఏఏ పట్ల తమ వైఖరిని స్పష్టం చేయాలంటూ మంత్రిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు వారిని బలవంతంగా అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటనలో పోలీసుల విధులకు ఆటంకం కలిగించారంటూ ఎస్ఐ శంకర్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు.

మా గోస ఎవరికి చెప్పుకోవాలి?

● ఎండుతున్న పంటల పొలాలు చూసి రైతు కన్నీరు ● పొలం మధ్యలో పడుకొని తన బాధ వెళ్లబోసుకున్న వైనం





పొలంలో పడుకొని రోదిస్తున్న రైతు నర్సింహ

సూర్యాపేటరూరల్, మార్చి 20: ఆరుగాలం కష్టపడి కంటికి రెప్పలా కాపాడుకున్న పంటలు కళ్లెదుటే ఎండిపోతుంటే రైతుల గోస వర్ణనాతీతంగా మారింది. నీళ్లలేక పంటలు ఎండిపోతుంటే పంటలను చూసి వారు కన్నీళ్లు ఆపుకోలేకపోతున్నారు. వరిపొలం పొట్టకు వచ్చే దశలో పంటకు సాగు నీరు అందక ఎండుతుంటే గోస ఎవరికి చెప్పుకోవాలో తెలియక గుండెలవిసేలా రోదిస్తున్నారు. రైతులు ఎంతో ఆశతో పంటలు సాగు చేస్తే తీరా భూగర్భజలాలు అడుగంటి బోరు బావుల్లో సైతం నీరు రాక దిక్కు తోచని స్థితిలో కన్నీరు మున్నీరవుతున్నారు. సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండల పరిధిలోని యర్కారం అవాసప్రాంతమైన దుబ్బతండాకు చెందిన రైతు దరవత్ నర్సింహ పొలానికి సాగునీరు రాకపోవడంతో పొలంలోనే పడుకుని రోదిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. నర్సింహ తన కున్న 20కుంటల భూమితో పాటు నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని ఎస్సారెస్పీ కాల్వ నీళ్లతో ఆధారపడి పొలాన్ని సాగుచేస్తున్నాడు. నాలుగు సంవత్సరాలుగా కౌలుకు తీసుకుని కారుకు 20పుట్ల ధాన్యం పండిస్తున్నాడు. ఇప్పుడు ఎస్సారెస్పీ కాల్వ నీరు రాకపోవడంతో పంటకు నీరు అందడం లేదని, తీరా పంట చేతికి వచ్చే సమయంలో సాగునీరు లేకపాయె అని రైతు పొలం వద్దకు వెళ్లినప్పుడల్లా ఎండిపోతున్న పొలాన్ని చూసి రోదిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. 'నన్ను ఆదుకునేది ఎవరు... పంట పెట్టుబడికి రూ.50వేలు పెట్టా.. భూయాజమానికి ఎకరానికి రూ.14వేల చొప్పున కౌలు ఎలా చెల్లించాలో అర్థం కావడంలేదు' అని ఆవేదన వ్యక్తం చేస్తున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఎస్సారెస్పీ కాల్వ కింది రైతులు పెద్ద మొత్తంలో వరిసాగు చేశారని, వారి పరిస్థితి ఆగమ్యగోచరంగా మరిందని గ్రామస్థులు తెలిపారు.

మర్రిగూడలో కారు బీభత్సం

● అదుపుతప్పి ఇంట్లోకి దూసుకెళ్లిన కారు



ఇంటి ఎదుట షెడ్డులోకి దూసుకెళ్లిన కారు

మర్రిగూడ, మార్చి 20: నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం వట్టిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బట్లపల్లి గ్రామంలో బుధవారం కారు బీభత్సం సృష్టించింది. అదుపుతప్పిన ఆ కారు ఓ ఇంట్లో దూసుకెళ్లింది. ఈ ఘటనలో యువకుడు గాయపడ్డాడు. ఎస్ఐ రంగారెడ్డి, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... డ్రైవర్ లవంగి కారులో యశ్వంత్ మర్రిగూడ నుంచి నాంపల్లికి వెళ్తున్నాడు. బట్లపల్లి గ్రామానికి చేరుకోగానే అదుపుతప్పిన కారు సమీపంలో ఓ ఇంటి వైపు దూసుకెళ్లి ముందున్న షెడ్డును ధ్వంసం చేసింది. ఆ సమయంలో అక్కడ ముగ్గురు యువకులు ఉన్నారు. వారిలో ఒకరికి గాయాలయ్యాయి. కారు అతివేగంగా దూసుకెళ్లడంతో రేకుల షెడ్ పూర్తిగా ధ్వంసమైంది. షెడ్డులో ఉన్న రెండు బైకులు కూడా ధ్వంసమైయ్యాయి. కారు తగలడంతో ఇంటి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం కూడా ఒరిగింది. కారు డ్రైవర్ అతివేగంగా రావడంతో ఈ సంఘటన జరిగిందని ఎస్ఐ రంగారెడ్డి, గ్రామస్తులు తెలిపారు. ఇంటి యజమాని మాదగోని వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కిడ్నాపర్ అనుకొని కూలీని వెంబడించి..

● భయంతో పరుగెత్తి హల్‌చల్ చేసిన కూలీ



కూలీని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

మోత్కూరు, మార్చి 20: రోడ్డు పనికి వచ్చిన కూలీని కిడ్నాపర్‌గా అనుమానించిన గ్రామస్థులు అతన్ని వెంబడించగా పోలీసులు అదుపులోకి తీసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం అనాజీపురంలో బుధవారం ఈ సంఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. అనాజిపురం వద్ద వలిగొండ-తొర్రూరు జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయి. సికింద్రాబాదు రైల్వే స్టేషన్‌లో బిక్షమెత్తుకుంటున్న ఒడిస్సా రాష్ట్రానికి చెందిన సహదేవ్ అనే వ్యక్తిని రోడ్డు లేబర్ కాంట్రాక్టర్ జయకృష్ణ నిర్మాణ పనులు చేసేందుకు కూలీగా తీసుకువచ్చాడు. వారం రోజులుగా అనాజిపురంలో రోడ్డు పనిచేస్తున్న సహదేవ్ గ్రామంలోని బుడిగ జంగాల కాలనీకి వెళ్లగా కొత్త వ్యక్తి కావడంతో కుక్క మొరిగింది. దీంతో కాలనీవాసులు ప్రశ్నించగా అతనికి తెలుగు రాక, కాలనీవాసులు అడిగేది అతనికి అర్థం కాకపోవడంతో చిన్న పిల్లలను ఎత్తుకెళ్లే కిడ్నాపర్‌గా అనుమానించిన కాలనీవాసులు పట్టుకునే ప్రయత్నం చేశారు. తనను కొడతారేమోనన్న భయంతో సహదేవ్ పరుగెత్తడంతో కాలనీవాసులు, గ్రామస్థులు వెంబడించారు. పరుగెత్తుతూనే తనను వెంబడిస్తున్న ప్రజలను బెదిరిస్తూ ఓ ప్రజాప్రతినిధి గెస్ట్‌హౌస్ ఆవరణలోకి వెళ్లి గేటు మూసి లోపల గడియ వేసుకున్నాడు. తోట పనికి ఉపయోగించేందుకే అక్కడ ఉంచిన కర్ర, కత్తి, ఇనుపరాడ్‌తో ప్రజలను బెదిరించాడు. సమాచారం తెలిసిన పోలీసులు ప్రహరీ గోడపైనుంచి ఆవరణలోకి దిగి సహదేవ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. విషయం తెలుసుకున్న రోడ్డు లేబర్ కాంట్రాక్టర్ అక్కడికి చేరుకుని కూలి పనుల నిమిత్తం తానే తీసుకువచ్చినట్లు వివరించటంతో అతనితోపాటు పంపారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ భాష తెలియక పోవడంవల్లే ఇదంతా జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో కిడ్నాపర్లెవరూ సంచరించడం లేదని, కిడ్నాపర్లు తిరుగుతున్నారన్న వదంతులను నమ్మవద్దన్నారు. అలాంటిదేమైనా ఉంటే తామే ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.

కాషాయీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలి



ఆలేరులో భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆలేరు రూరల్/ మోట కొండూర్, మార్చి 20: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిర్వహిస్తున్న కాషాయీకరణకు వ్యతిరేకంగా యువత, ప్రజలు ఉద్యమించాలని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా కార్యదర్శి బేజాడి కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం ఆలేరులో భారత స్వాతంత్ర్య ఉద్యమంలో తమ ప్రాణాలను అర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంఘం ఆధ్వర్యంలో మార్చి 15 నుంచి 30 వరకు వారి వర్ధంతి, జయంతులను నిర్వహించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతాన్ని ప్రేరేపిస్తూ దేశంలో మారణ హోమం సృష్టిస్తోందని, ప్రజా స్వామిక వాదులు, విప్లవ శక్తులు వారికి వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, ఆర్ ఉదయ్, లోకేష్, సుదర్శన్, సిద్దు, రాఖేష్ ఉన్నారు.

● భగత్ సింగ్ జీవితం దేశ యువతకు స్ఫూర్తిదాయకమని అటువంటి మహనీయులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శులు ఎల్లంకి మహేష్, పేరబోయిన మహేందర్ డిమాండ్ చేశారు. మోటకొండూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఏఐవైఎఫ్ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు బీరకాయల మధు, ప్రధాన కార్యదర్శిగా బొలగాని అశోక్, ఉపాధ్యక్షులుగా మారబోయిన దేవరాజు, హాజీ మస్తాన్, సహాయ కార్యదర్శిగా గట్టికొప్పుల శ్రీధర్, దామర నర్సింహ్మలను నియమించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గాదెగాని మాణిక్యం, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మహ్మద్ నహీమ్, ఆలేటి బాలరాజు, పాండు, కర్ణాకర్, దయాకర్ పాల్గొన్నారు.

ఆలేరు బార్ అసోసియేషన్‌లో వివక్ష తగదు


కోర్టు వద్ద నిరసన తెలుపుతున్న అడ్వొకేట్‌లు

ఆలేరు రూరల్, మార్చి 20: ఆలేరు బార్ అసోసియేషన్‌కు జరుగుతున్న ఎన్నికల్లో తనకు అవకాశం ఇవ్వకుండా ఎన్నికల్లో పాల్గొనకుండా చేస్తూ వివక్షను చాటుతున్న వారిపై ఎన్నికల్లో గెలుపొందడం కోసం చేస్తున్న స్వార్థ రాజకీయాలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అడ్వొకేట్‌లు కేవీ.ప్రసాద్, భీమగాని శ్రీనివాస్‌లు బుధవారం ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్‌ను సైతం ఆలేరు బార్ కౌన్సిల్ కోసం జరుగుతున్న ఎన్నికల్లో వారికి ఓటు హక్కులు కల్పించాలని కోరినా అవకాశం కల్పించకుండా అవకాశ వాద రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. తెలంగాణ బార్ కౌన్సిల్ కేవి ప్రసాద్, భీమగారి హరిబాబులకు ఆలేరు బార్ కౌన్సిల్‌లో సభ్యత్వం కల్పిస్తూ ఉత్తర్వులను జారీ చేసినా ఒకరిని తీసుకొని మరొకరిని తీసుకోకుండా స్వార్థ రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో అడ్వకేట్‌లు కేవి ప్రసాద్, భీమగాని శ్రీనివాస్, భీమగాని హరిబాబులు ఉన్నారు.

చౌటుప్పల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్



చౌటుప్పల్ టౌన్, మార్చి 20: చౌటుప్పల్ బార్ అసోసియేషన్‌కు నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. బుధవారం నామినేషన్‌లకు చివరి రోజు కావడంతో ఒక ఉపాధ్యక్ష పదవికి తప్ప మిగిలిన అన్ని పదవులకు ఒక్కో నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవం అయినట్టుగా ఎన్నికల అధికారి కె.వెంకటయ్య తెలిపారు. అధ్యక్షుడిగా ఊడుగు శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా రాపోలు వేణుకుమార్, సహాయ కార్యదర్శిగా జల్లా రమేష్, కోశాధికారిగా పడమటి మహిపాల్‌రెడ్డి, లైబ్రరీ ఇంచార్జ్‌గా నర్రి స్వామి, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా మక్తాల నర్సింహగౌడ్, కార్యవర్గ సభ్యులుగా జంపాల శ్రీశైలం, జక్కర్తి శేఖర్, మహిళా సభ్యురాలుగా స్వాతి లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 22 న జరిగే ఉపసంహరణ నాటికి ఉపాధ్యక్ష పదవి ఏకగ్రీవం కానుంది.

28న భువనగిరి బార్ అసోసియేషన్ ఎన్నిక

భువనగిరి టౌన్, మార్చి 20: భువనగిరి బార్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ గడువు బుధవారంతో ముగిసింది. అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఇద్దరేసి న్యాయవాదులు నామినేషన్లు వేయగా మరో మూడు పదవులు ఏకగ్రీవమయ్యాయి. అధ్యక్ష పదవికి బబ్బూరి హరినాథ్‌గౌడ్, గజ్జల రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్ష పదవికి కలకుంట జయ, దొంతిరెడ్డి ఉపాధ్యక్ష పదవికి కలకుంట జయ, దొంతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి నామినేషన్లు వేశారు. ప్రధాన కార్యదర్శిగా కుక్కదువు కృష్ణ, సహాయ కార్యదర్శిగా మట్ట వెంకటేశం, సాంస్కృతిక కార్యదర్శిగా బొడ్డు కిషన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 21న నామినేషన్ల పరిశీలన, 22న ఉపసంహరణకు గడువు ఉన్నది. ఎన్నిక అనివార్యమైతే 28న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ నిర్వహించి అనంతరం ఓట్లను లెక్కిస్తామని ఎన్నికల అధికారి జిట్ట భాస్కర్‌రెడ్డి తెలిపారు. 141 మంది న్యాయవాదులు బార్ అసోసియేషన్ సభ్యత్వం కలిగి ఉన్నారు.

పక్షులకు నీటి వసతి కల్పించాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రీనిటీ విద్యాసంస్థల డైరెక్టర్ మంజుల

చౌటుప్పల్ టౌన్, మార్చి 20: ఎండా కాలంలో ఇళ్ల వద్ద పక్షులకు నీటి వసతి కల్పించాలని ట్రీనిటీ విద్యాసంస్థల డైరెక్టర్ అండ్ ప్రిన్సిపాల్ ఉజ్జిని మంజుల అన్నారు. చౌటుప్పల్ పట్టణంలోని ట్రీనిటీ విద్యాసంస్థల్లో బుధవారం ప్రపంచ పిచ్చుక(స్పారో)ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భగా విద్యార్థులకు పిచ్చుకలపై అవగాహన కల్పించారు. ఎండా కాలంలో తాగునీరు దొరకక పిచ్చుకలు అల్లాడిపోతుంటాయని, ఇళ్ల వద్ద పిచ్చుకలకు అనుకూలమైన స్థలాల్లో చిన్న చిన్న పాత్రల్లో నీటి వసతి కల్పించాలని ఆమె అన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ కీవీటీ కృష్ణారావు పాల్గొన్నారు.

మేరు కులస్థులను ఆదుకోవాలి


మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పోల్కం శ్రీనివాస్

భువనగిరి రూరల్, మార్చి 20: సామాజికంగా, ఆర్థికంగా వెనుకబాటుకు గురైన మేరు కులస్థులను అన్ని విధాలుగా ఆదుకోవాలని మేరు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఓబీసీ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పోల్కం శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మేరు కులస్థులను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. సుమారు రాష్ట్రంలో దుర్భర పరిస్థితిలో జీవనం గడుపుతున్న దాదాపు 50 వేల మంది కులస్థులకు కుట్టు మిషన్లు అందజేయడంతో పాటు ఇందిరమ్మ పథకం కింద స్థలాలు కేటాయించి, ఇళ్ల నిర్మాణం చేపట్టే విధంగా చూడాలని కోరారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో మేరు సంఘం రాష్ట్ర నాయకులు ఆదిమూలం శంకర్, సాయిచరణ్‌రెడ్డి, పోల్కం వినయ్ రాజ్, శివకుమార్, జి.దశరథ ఉన్నారు.

29న మునిసిపల్ తై బజార్ వేలం


భువనగిరి మునిసిపల్ కార్యాలయం

● *గత సంవత్సరం రూ.8.71 లక్షలకు వేలం పాట*

భువనగిరి టౌన్, మార్చి 20: భువనగిరి మునిసిపాలిటీ పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి తై బజార్ వసూలు హక్కు కోసం ఈ నెల 29న బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్టు కమిషనర్ పి రామాంజులొరెడ్డి బుధవారం తెలిపారు. వేలంపాటలో పాల్గొనే ఆసక్తి గలవారు రూ.2000 దరఖాస్తు రుసుము, డిపాజిట్‌గా రూపాయలు 2.50లక్షల డీడీని ఈనెల 28 సాయంత్రం 5 గంటల లోపు మునిసిపల్ కార్యాలయంలో అందించాలని సూచించారు. దరఖాస్తు రుసుము తిరిగి చెల్లించడబడదని, వేలంపాట హక్కు దక్కించుకున్న వారికి మినహా మిగతా వారందరికీ డిపాజిట్ సొమ్ము తిరిగి చెల్లిస్తామని తెలిపారు. కాగా వేలంలో పాల్గొనేవారు మునిసిపాలిటీకి ఎలాంటి పన్నులు బకాయిగా ఉండరాదని తెలిపారు. రూ.9,58,100 తో బహిరంగ వేలం పాట ప్రారంభమవుతుందని కమిషనర్ పేర్కొన్నారు.

తై బజార్ వసూలు ఇలా..

మునిసిపల్ ఆదాయం లక్ష్యంగా మునిసిపల్ వ్యవస్థ అమల్లోకి వచ్చినప్పటి నుంచి పట్టణాల్లో సంచార వ్యాపారులు, ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి సరుకులు, తదితర సామగ్రిని దిగుబడి చేసే వాహనాల నుంచి తై బజారును వసూలు చేస్తుంటారు. ఇందుకు మునిసిపాలిటీ నిర్ణయించిన చార్జీల ప్రకారమే తైబజార్ వసూలు చేయాల్సి ఉంటుంది. కానీ క్షేత్రస్థాయిలో ఇలాంటి నిబంధనలేవీ అమలు కావడంలేదని ఆరోపణలు ఉన్నాయి. తై బజార్ వసూలు హక్కు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఇస్తానుసారంగా వసూలు చేస్తుండటంతో వ్యాపారులపై అధిక చార్జీల భారం పడుతుండగా, మునిసిపాలిటీకి మాత్రం ఆశించిన స్థాయిలో ఆదాయం లభించడం లేదని పలువురు అంటున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా నిర్వహిస్తున్న వేలంపాటలో నియమ నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చిరువ్యాపారులు పేర్కొంటున్నారు. మునిసిపాలిటీ నిర్ణయించిన తై బజార్ చార్జీలు ఇలా ఉన్నాయి. ప్రతీరోజు గంప రూ.10, తోపుడు, ఐస్‌క్రీం, సోడా, రెండు ఎడ్ల బండ్లకు రూ.15 చొప్పున, ఆటో రిక్షాకు రూ.15, టాటా ఏస్, ఆ పై బడి వాహనాలకురూ.60 చొప్పున వసూలు చేయాల్సి ఉంటుంది.

ఆదాయాన్ని పెంచుకునే దిశగా..

2023-24 ఆర్థిక సంవత్సరానికి 28 మార్చి 2023న నిర్వహించిన వేలంపాటలో అప్పటి కాంట్రాక్టర్ రూ.8.71 లక్షలతో తై బజార్ వసూలు హక్కును దక్కించుకున్నాడు. అయితే గత ఏడాదిలో పోలిస్తే నూతన ఆర్థిక సంవత్సరం తై బజార్ ఆదాయాన్ని పెంచుకోవాలని మునిసిపల్ అధికారులు భావిస్తున్నారు. దీంతో ప్రారంభ పాటగా రూ.9,58,100 గా నిర్ణయించారు.

ఆధ్యాత్మిక భావన అలవర్చుకోవాలి


ఎమ్మెల్యే అయిలయ్యకు గొర్రె పిల్లను అందజేసి, గొంగడితో సన్మానిస్తున్న నాయకులు

ఆత్మకూరు(ఎం) మార్చి 20: నిత్య జీవితంలో ఎంతో ఒత్తిడితో కూడుకున్న జీవన విధానాన్ని అనుభవిస్తున్న ప్రతీ ఒక్కరు మానసిక ప్రశాంతత కోసం ఆధ్యాత్మిక భావన అలవర్చుకోవాలని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కోరారు. మండలంలోని రాయిపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న బీరప్ప దేవాలయానికి బుధవారం ఎమ్మెల్యే ప్రధాన ద్వారం ప్రతిష్ఠాపన చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల్లో జరిగే కార్యక్రమాలు ప్రజలల్లో భక్తి భావనతో పాటు ఐకమత్యాన్ని పెంచడానికి దోహదపడతాయన్నారు. అనంతరం కుర్మ సంఘం నాయకులు గొంగడి, గొర్రె పిల్లతో ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో ఆత్మకూరు, యాదగిరిగుట్ట ఎంపీపీ లు తండ మంగమ్మ, చీర శ్రీశైలం, రాయిపల్లి మాజీ సర్పంచులు జెట్ట, శ్రీశైలం , జెట్ట, దనుంజయ్య కురుమ సంఘం అధ్యక్షుడు జెట్ట వెంకన్న, సభ్యులు చంద్రయ్య, మల్లయ్య, పాల్గొన్నారు.

ఆలేరు రూరల్: ప్రతి ఒక్కరు దైవభక్తిని అలవర్చుకుని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. మండలంలోని బహదూర్‌పేటలో దుర్గామాత ఆలయం కోసం భూమి పూజను నిర్వహించారు. కార్యక్రమంలో యాదగిరిగుట్ట ఎంపీపీ చీర శ్రీశైలం, నాయకులు నీలం పద్మ, పేరపు రాములు, నర్సింహులు, సంపత్ ఉన్నారు.

భూదాన్‌పోచంపల్లి : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక జ్ఞానం పెంపొందించుకోవాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని జూలూరు గ్రామానికి చెందిన వేణుగోపాలస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పాక మల్లేష్‌యాదవ్, నాయకులు కొట్టం కరుణాకర్‌రెడ్డి, వేణు గోపాల స్వామి దేవాలయం అధ్యక్షుడు కొమిరె భాస్కర్, ఉపాధ్యక్షుడు పెరుమాండ్ల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి, ఓబీసీ కాంగ్రెస్ నాయకులు దిండు బాలరాజుగౌడ్, కోశాధికారి ఐత రాజు భిక్షపతి పాల్గొన్నారు.

● భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని ప్రసిద్ధ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో జరిగే కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి దంపతులను ఆహ్వానిస్తూ దేవాలయం అధ్యక్షుడు అంకం వినోద్‌కుమార్, ధర్మకర్తలు బుధవారం ఆహ్వానపత్రికను అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ కౌన్సిలర్ మోటె రజిత రాజు, దేవాలయం చైర్మన్ అంకం వినోద్‌కుమార్, ధర్మకర్తలు మోటె మహేష్, చేరాల సుధీర్, వేశాల మురళి, కూరపాటి బాబు, పొనమోని కావ్య, వంగూరి బాలకృష్ణ, పాపని ముత్యాలు, గోశిక శివకుమార్, చెరుకు శ్రీకాంత్, చేరాల శ్రీకాంత్ పాల్గొన్నారు.


పోచంపల్లిలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

మోదీ పాలనలోనే అభివృద్ధి.. సంక్షేమం

● *మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్*


మోత్కూరులో చేనేత మగ్గాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎంపీ నర్సయ్యగౌడ్

మోత్కూరు/ అడ్డగూడూరు, మార్చి 20: కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడతాయని మాజీ ఎంపీ, భువనగిరి పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. బుధవారం మోత్కూరు ఆర్యవైశ్యభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ గల్లీ (రాష్ట్రం)లో లేదు, ఢిల్లీలో లేదు. ఆ పార్టీకి ఓటు వేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. కాంగ్రెస్ పార్టీది ఐరన్ లెగ్ అని, అది అధికారంలోకి రాగానే బోర్లు, పొలాలు ఎండిపోతున్నాయన్నారు. అందువల్ల ఆ పార్టీ అభ్యర్థులకు ఓటు వేస్తే నిష్ప్రయోజనమన్నారు. తాను భువనగిరి ఎంపీగా ఉన్న కాలంలో కేంద్రం నుంచి రూ.9 వేల కోట్ల నిధులు తీసుకువచ్చి ఈ ప్రాంతంలో ఎయిమ్స్, కేంద్రీయ విద్యాలయం, ఎంఎంటీఎస్ రైలు, డ్రైపోర్టు, గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు, మాతా శిశు ఆస్పత్రి, 524 కిలోమీటర్ల జాతీయ రహదారి లాంటి ఎన్నో అభివృద్ధి పనులు చేశానన్నారు. అంతకు ముందు మండలంలోని పొడిచేడు గ్రామానికి వెళ్లి తెలంగాణ మలి ఉద్యమంలో తొలి అమరుడు కాసోజు శ్రీకాంత్‌చారి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అతని తల్లి శంకరమ్మ ఇంటికి వెళ్లి ఆమెతో మాట్లాడారు. మోత్కూరు ఇక్కత్ హ్యాండ్లూమ్ కేంద్రంలో చేనేత మగ్గాలను ఆయన పరిశీలించారు. చేనేత కార్మికుల నుద్దేశించి మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ పార్లమెంటు నియోజకవర్గం కన్వీనర్ బందారపు లింగస్వామి, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కడియం రామచంద్రయ్య, కాప రవి, కూరాకుల వెంకన్న, చాడ మంజుల, పోచం సోమయ్య, కొణతం నాగార్జునరెడ్డి, దొంతి నర్సింహారెడ్డి, గౌరు శ్రీనివాస్, బొట్లు అబ్బయ్య, దీటి సందీప్, ఎం.సోమయ్య పాల్గొన్నారు.

● అడ్డగూడూరు మండలంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ ముఖ్యకార్యకర్తలు, అన్ని కులా సంఘాలతో మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవి ఉన్నా.. లేకున్నా.. పదేళ్లుగా ప్రజల మధ్య ఉంటూ భువనగిరి ప్రాంత అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నానని అన్నారు. మారోసారి అవకాశం ఇస్తే భువనగిరి పార్లమెంట్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ గల్లిలో లేదు, ఢిల్లిలో లేదు ఎద్దవ చేశారు. కార్యక్రమంలో తుంగతుర్తి నియోజకవర్గ ఇంచార్జీ కడియం రామచంద్రయ్య, పార్లమెంట్ల్ కన్వీనర్ బందారపు లింగస్వామి గౌడ్, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు ననుబోతు సైదులు, ప్రధానకార్యదర్శి సోమిరెడ్డి నర్సిరెడ్డి, ఉపాధ్యాక్షులు పెద్ద బాల్నె బిక్షం, మహిళ సంఘం అధ్యక్షురాలు తోట ఆలివేలు ఉన్నారు.

గోపి ఆశయ సాధనకు కృషి చేయాలి


చౌటుప్పల్‌టౌన్: సమావేశంలో మాట్లాడుతున్న నర్సిరెడ్డి

చౌటుప్పల్ టౌన్/ భువనగిరి టౌన్/ రామన్నపేట/ భూదాన్‌పోచంపల్లి, మార్చి 20: సీపీఎం నేత తిరందాస్ గోపి ఆశయ సాధనకు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దోనూరు నర్సిరెడ్డి, మాటూరు బాలరాజ్‌లు కోరారు. చౌటుప్పల్ పట్టణంలోని కందాళ రంగారెడ్డి భవన్‌లో బుధవారం గోపి 8 వర్ధంతి సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండి.పాషా, మండల కార్యదర్శి గంగదేవి సైదులు పాల్గొన్నారు. భువనగిరిలో నిర్వహించిన కార్యక్రమంలో తిరందాసు గోపి విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ అధ్యక్ష కార్యదర్శులు గద్దె నర్సింహ, కొండమడుగు నర్సింహ, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ, నాయకులు కల్లూరి మల్లేశం, మాయ కృష్ణ, బందెల ఎల్లయ్య, కొలుపుల వివేకానంద పాల్గొన్నారు. రామన్నపేటలో నిర్వహించిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం, వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గొరిగె సోములు, జిల్లా కమిటీ సభ్యులు బొడ్డుపల్లి వెంకటేశం, బందెల భిక్షం, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు గంటెపాక శివకుమార్, భూడిద భిక్షం, బీంపాక ప్రశాంత్, గట్టు నర్సింహ్మా, తుర్కపల్లి నరేష్, గంటెపాక శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. భూదాన్‌పోచంపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, మండల కార్యదర్శి పగిల్ల లింగారెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజు, నాయకులు కోట రామచంద్రారెడ్డి, ప్రసాదం విష్ణు, మంచాల మధు, నెల్లికంటి జంగయ్య, దుబ్బాక జగన్, గూడూరు కృష్ణారెడ్డి, నాయకులు యాదగిరి, భాను పాల్గొన్నారు.

ఆసుపత్రి కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి


రామన్నపేట: ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రామన్నపేట/ భూదాన్‌పోచంపల్లి, మార్చి 20: రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు అందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేశం డిమాండ్ చేశారు. మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో బుధవారం సూపరింటెండెంట్ డాక్టర్ వీరన్నకు వినతిపత్రం అందజేసి, అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ గొరిగె సోములు, జిల్లా కమిటీ సభ్యులు బొడ్డుపల్లి వెంకటేశం, బందెల భిక్షం, పారిశుధ్య కార్మికులు బీంపాక నాగేశ్వర్, నారపాక రాజ్ కుమార్, గాదె యాదమ్మ పాల్గొన్నారు.

● రెండో ఆరోగ్య కార్యకర్తలుగా పనిచేస్తున్న వారిని ఎలాంటి షరతులు లేకుండా వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ భూదాన్‌పోచంపల్లి పీహెచ్‌సీ ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ నెలా 1వ తేదీన జీతాలు అందించాలని, వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని కోరారు. నీలమ్మ, జానకి, అనూరాధ, సునీత, రేణుక, సంధ్యారాణి, గీత, సునీత పాల్గొన్నారు.

కళారూపాల ద్వారా ప్రజలను చైతన్యం చేయాలి

రామన్నపేట, మార్చి 20: ప్రజా నాట్య మండలి కళాకారులు ఆట-పాటలతో పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలను చైతన్యం చేయాలని ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గంటెపాక శివకుమార్ అన్నారు. బుధవారం మండలంలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన ఆ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ విలువల్ని కాలరాస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను కొల్లగొడుతోందని, పాలకుల వైఫల్యాలను ప్రజలకు ఆటా-పాట కళారూపాల్లో చైతన్యం చేయాలని కళాకారులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో పీఎన్ఎం మండల కార్యదర్శి గంటెపాక శ్రీకృష్ణ, నాయకులు పండుగ రాజమల్లు, పృధ్వి, తుర్కపల్లి నరేష్, మజ్జారి సాయి, పుట్టల ఉదయ్, ప్రశాంత్, గణేష్, నర్సింహ, చరణ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

యాదగిరిగుట్ట రూరల్, మార్చి 20: యాదగిరిగుట్టలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం రాయగిరి గ్రామానికి చెందిన కుసందుల శివ(26) మంగళవారం రాత్రి రాయగిరి నుంచి యాదగిరిగుట్టకు తన ద్విచక్రవాహనంపై వస్తుండగా గుట్ట మునిసిపాలిటీ పరిధిలోని కొత్తగుండ్లపల్లి యూనియన్ బ్యాంకు ఎదుగా ద్విచక్రవాహనంతో అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొట్టాడు. దీంతో తలకు బలమైన గాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం వెంటనే భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఒంటరితనం భరించలేక ఆత్మహత్య

వలిగొండ, మార్చి 20: ఒంటరిగా ఉండడంతో మద్యానికి బానిసై గడ్డిమందు తాగి ఒక వ్యక్తి బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మునగాల తుర్కపల్లి గ్రామానికి చెందిన సింగనబోయిన నర్సింహ (58) వృత్తిరీత్యా కూలీ అతని భార్య, కుమారుడు ఇద్దరూ హైదరాబాద్‌లో ఉండగా నర్సింహ మాత్రం స్వగ్రామంలోనే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఒంటరిగా ఉండడం వల్ల మద్యానికి బానిసయ్యాడు. ఆ గ్రామ సమీప చెరువు వద్ద ఒక చెట్టు కింద బుధవారం గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం వరుసకు సోదరుడైన మల్లేశం కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశాడు. నర్సింహ కుమారుడు అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

నియామకాలు

ఆత్మకూరు(ఎం) : భారతీయ జనతా యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని పారుపల్లి గ్రామానికి చెందిన దయ్యాల కుమారస్వామిని నియమిస్తూ ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ నియామక పత్రం అందజేశారు.

తుర్కపల్లి : బీజేపీ గిరిజన మోర్చా జిల్లా ఉపాధ్యాక్షుడిగా తుర్కపల్లి మండలం రామోజీనాయక్‌తండాకు చెందిన బానోతు శంకర్‌నాయక్‌ను నియమించారు. గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆజ్మీరా కిషన్‌నాయక్ నియామకపు పత్రాన్ని అందజేశారు.

వలిగొండ: మండల కేంద్రానికి చెందిన రేగూరి అమరేందర్ భారతీయ జనతా పార్టీ యువమోర్చ జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆయనకు నియామకపత్రాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్ బీజేవైఎం జిల్లా అధ్యక్షులు పట్నం కపిల్ అందజేశారు. కొప్పుల యాదిరెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

భూదాన్‌పోచంపల్లి : బీజేపీ పట్టణ కమిటీ నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా డబ్బికార్ సాహేష్‌కుమార్‌ను జిల్లా కమిటీ అధ్యక్షుడు పాశం భాస్కర్ ప్రకటించారు. పట్టణ కమిటీ అధ్యక్షుడు సాహేష్‌కుమార్‌తోపాటు ఉపాధ్యక్షులుగా చిటుకుల అంబదాసు, ఇడమోని అంజయ్య, ఒంటెద్దు సత్యం, సైదుగాని స్వామి, ప్రధాన కార్యదర్శులుగా ఏలె శ్రీనివాస్, గొలనుకొండ ప్రభాకర్, సహాయ కార్యదర్శులుగా భారత లక్ష్మణ్, బాలరాజు, చేరాల లింగయ్య, మూటపురం రవి, వంగూరి సిద్దు, విడెం సాయికుమార్, కోశాధికారిగా సీత లక్ష్మణ్ నియమితులయ్యారు.


సాహేష్‌కుమార్

సంక్షిప్తంగా..

చౌటుప్పల్ టౌన్ : భువనగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించేందుకు ప్రతీ ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, మునిసిపల్ అధ్యక్షుడు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి కోరారు. బుదవారం నిర్వహించిన బీజేపీ సమావేశంలో చౌటుప్పల్ మునిసిపాలిటీలోని 49 వ పోలింగ్ బూత్ అధ్యక్షుడిగా బి.శ్రీశైలం, 53వ బూత్ అధ్యక్షుడిగా కందుల నరేష్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు ఆలె చిరంజీవి, కాసుల వెంకటేశం, కొండూరు దుర్గయ్య, సాయి, విఘ్నేష్ పాల్గొన్నారు.

గుండాల: మండలంలోని తుర్కలషాపురం, సుద్దాల గ్రామాల్లో పశువైద్య, పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో 275 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఇచ్చారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ యాకూబ్, గోపాలమిత్రలు గోవింద్, నరేశ్, శేఖర్, శ్రీను, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మోత్కూరు : మండలంలోని దత్తప్పగూడెం గ్రామానికి చెందిన ముక్కెర్ల కృష్ణ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కాంగ్రెస్ స్థానిక నాయకులు అతని పరిస్థితిని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన పంపిన రూ.10వేల ఆర్థిక సహాయాన్ని బుధవారం మాజీ ఎంపీటీసీ ఎలుగు పార్వతమ్మయాదయ్య బాధిత కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు చింత చంద్రయ్య, నాయకులు వెంకన్న ఉన్నారు.

ఆలేరు రూరల్: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, ప్రతీ ఒక్కరూ ఓటు హక్కుపై అవగాహన పెంపొందించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడాలని ఏపీఎం మీన అన్నారు. బుధవారం ఆలేరులో ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించి దేశ అభివద్ధికి పాటు పడే మంచి నేతను ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో మల్లేశం, సంతోష్, సరస్వతి, శివకుమార్ ఉన్నారు.

ఆత్మకూరు(ఎం) : రాష్ట్రంలో ఉన్న రెడ్డి వర్గాల అభ్యున్నతి కోసం సీఎం రేవంత్‌రెడ్డి, రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆయన విలేకర్ల తో మాట్లాడుతూ రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం వలన పేద మధ్యతరగతి రెడ్డి కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

చౌటుప్పల్ టౌన్ : ఉత్తమ సేవలను అందించిన ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల హృదయాల్లో నిలిచిపోతారని చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. చౌటుప్పల్ మునిసిపల్ కార్యాలయం మేనేజర్ వెంకటేశ్వర్లు ప్రమోషన్ పై ఏఈగా నల్లగొండ హౌసింగ్ కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బుధవారం మునిసిపల్ కార్యాలయంలో వెంకటేశ్వర్లుకు వీడ్కోలు సభను నిర్వహించారు. చైర్మన్ రాజు, కమిషనర్ వెంకటేశ్వర నాయక్ లు సన్మానించి, ఉత్తమ సేవలు అందించిన వెంకటేశ్వర్లును అభినందించారు. వైస్‌చైర్మన్ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్లు ఎండి.బాబా షరీఫ్, కామిశెట్టి భాస్కర్, కార్యాలయ ఉద్యోగులు రవీందర్, లింగయ్య ఉన్నారు.

తుర్కపల్లి : మత్స్య సంపద అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎరుకల వెంకటేశ్‌గౌడ్ అన్నారు. తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామంలో మత్స్య కార్మిక సహకార సంఘం చైర్మన్‌గా ఎన్నికైన ధ్యానబోయిన వెంకటేశ్ ముదిరాజ్ సన్మానోత్సవం కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వెంకటేశ్ ముదిరాజ్‌ను ప్రజాప్రతినిధులు, మత్స్య కార్మిక సంఘం నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు.

చౌటుప్పల్ రూరల్ : మండలంలోని దండుమల్కాపురం ఆందోల్‌మైసమ్మ దేవాలయ హుండీ లెక్కింపును బుధవారం నిర్వహించారు. 43 రోజులకు గాను రూ.4,26,275 ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో దేవాదాయశాఖ సహాయ కమీషనర్ మహేందర్‌కుమార్, ఈఓ మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.